సాక్షి
ఏలూరు

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



వ్యవసాయం పండగ
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేయడంతో వ్యవసాయం పండగలా మారింది. దీనిపై కథనం.. 8లో

వైఎస్సార్ సీపీలోకి చేరికలు
ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. 8లో



సాంకేతికతతో కొత్త ఆవిష్కరణలు
నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ అండ్ క్యాంపస్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో గత రెండు రోజులు నిర్వహిస్తున్న టెక్‌జైట్–24 ఆదివారం ముగిసింది. 8లో

మేమంతా సిద్ధంకు సర్వ సన్నద్ధం

- నేడు ఏలూరు జిల్లాలోకి సీఎం జగన్ బస్సుయాత్ర
- 16న భీమవరంలో భారీ బహిరంగ సభ
- చురుగ్గా ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు విచ్చేస్తున్న అభిమాన నేతకు దారి పొడవునా అపూర్వ స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం కృష్ణా జిల్లా నాగవరప్పాడులో బహిరంగ సభ అనంతరం హనుమాన్ జంక్షన్ క్రాస్ రోడ్డు, ఏలూరు క్రాస్ రోడ్డు, దెందులూరు క్రాస్ రోడ్డు మీదుగా యాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తుంది. భీమడోలు, కైకరం మీదుగా రాత్రి 8 గంటల సమయానికి నారాయణపురం చేరుకుంటుంది. అక్కడ ఏర్పాటుచేసిన క్యాంపు వద్ద రాత్రికి సీఎం జగన్ బస చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బస్సు యాత్రలో భాగంగా జిల్లాలోని దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల మీదుగా సీఎం జగన్ రోడ్‌షోలో పాల్గొంటారు.


నారాయణపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం


అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

16న భీమవరంలో సభ

భీమవరంలో మంగళవారం మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొంటారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. భీమవరం బైపాస్ రోడ్డులోని మెంటేవారితోట ప్రాంతంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బహిరంగ సభ అనంతరం సీఎం జగన్ రోడ్డుషో ద్వారా తూర్పుగోదావరి జిల్లాకు పయనమవుతారు.

ఏర్పాట్ల పరిశీలన

ఉంగుటూరు : సీఎం జగన్ బస్సు యాత్రలో భాగంగా సోమవారం రాత్రి నారాయణపురంలో బస చేయనున్నారు. ఈనేపథ్యంలో బస ఏర్పాట్లను ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం పరిశీలించారు. బస్సు యాత్రను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే వాసుబాబు పిలుపునిచ్చారు.

పటిష్ట బందోబస్తు

సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో నారాయణపురంలో బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. నారాయణపురంలో ముఖ్యమంత్రి బస చేసే ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, ఎటువంటి ఆటంకాలు లేకుండా యాత్ర సాగేలా చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, సీఐ సుభాష్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి

ఏలూరు (మెట్రో): భారత రాజ్యాంగ నిర్మాణంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర ఎనలేనిదని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గొప్ప దేశ భక్తి, మానవతా విలువలు కలిగిన అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు విద్యావంతులై అభివృద్ధి చెందాలన్నారు. జేసీ బి.లావణ్యవేణి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని పొందుపరిచారన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్ఎస్ కృపావరం, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, పశు సంవర్ధక శాఖ జేడీ జి.నెహ్రూ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా, సెట్‌వెల్ సీఈఓ మెహ్రాజ్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో చట్టబద్ధ గ్రామసభలు

ఏలూరు (మెట్రో): రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని గ్రామ పంచాయతీలలో చట్టబద్ధమైన గ్రామ సభలు నిర్వహించామని డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ చెప్పారు. నిబంధనల మేరకు పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై ప్రజలతో చర్చించాలని అలాగే నిధుల లభ్యత మేరకు గ్రామ అభివృద్ధిపై తీర్మానాలు చేయాల్సి ఉందన్నారు. అయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున గ్రామ సభలలో విధానపరమైన నిర్ణయాలు ఏమీ తీసుకోలేదన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీలలో అంబేడ్కర్ చిత్రపటాలకు అలంకరణలు చేసి నివాళులు అర్పించారని డీపీఓ తెలిపారు.

ఐటీడీఏ చేరుకున్న ఈవీఎంలు


కేఆర్‌పురం ఐటీడీఏ స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ కమెండో ఫోర్స్

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎమ్ బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్ ఆదివారం చేరుకున్నట్లు ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం బ్యాలెట్ యూనిట్స్ (340), కంట్రోల్ యూనిట్స్ (340), వీవీ ప్యాడ్స్ (360) ఆమోదం పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచినట్లు సూర్యతేజ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీల్ వేసి సెంట్రల్ కమెండో ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే సీసీ కెమెరాలను కూడా స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల నోడల్ అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

బస్సు యాత్రలో సీఎం జగన్‌పై దాడిపై ఏలూరు జిల్లాలో వెల్లువెత్తిన నిరసనలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్ర చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో చేసిన దాడి ఘటనపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. జిల్లాలో పలు చోట్ల దాడిని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ వస్తుండటంతో తట్టుకోలేక ఈ దుశ్చర్యకు ఒడిగట్టారని మండిపడ్డారు. – సాక్షి, నెట్‌వర్క్


ఏలూరులో నల్లరిబ్బన్ ధరించి నిరసన తెలుపుతున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని


కుక్కునూరులో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నాయకులు


దెందులూరులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నాయకులు


కోడూరుపాడులో నల్ల రిబ్బన్లతో నిరసన తెల్పుతున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఏలూరు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉక్రోషంతోనే టీడీపీ గుండాలు దాడులకు తెగబడ్డారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండిస్తూ ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఏలూరులోని పార్టీ నేతలతో కలిసి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఆళ్ల నాని మాట్లాడుతూ సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఉక్రోషంతో టీడీపీ గుండాలు రెచ్చిపోయి సీఎంపైనే దాడులకు పాల్పడి నీచమైన రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు, జనసేన కూటమితో రాష్ట్రంలో అరాచకం మితిమీరుతోందనీ, ప్రజలకు ఏమి చేస్తామో చెప్పుకోలేక ఓటమి భయంతో భౌతిక దాడులకు దిగుతున్నారని విమర్శించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు క్లస్టర్–1 పార్టీ మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ళ శ్రీదేవి, క్లస్టర్–2 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి పాల్గొన్నారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు
– ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేయించిన చంద్రబాబు అండ్‌కో ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హెచ్చరించారు. ఆదివారం దెందులూరులో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ సిద్ధం, బస్సు యాత్రలకు వస్తున్న ప్రజామద్దతు, అశేష జనవాహిని జీర్ణించుకోలేక చంద్రబాబు అండ్‌కో భౌతిక దాడులకు ప్రేరేపించడం సరైన విధానం కాదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణను ఎన్ని కుట్రలను పన్నినా ఆపలేరన్నారు. వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం గంగరాజు ఉన్నారు.


హేయమైన చర్య : పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

భీమడోలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం హేయమైన చర్య అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సీఎంపై హత్యాయత్నం ఘటనను తీవ్రంగా నిరసిస్తూ ఆదివారం నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాల్లో నల్ల రిబ్బన్లను ధరించి పాల్గొన్నారు. కోడూరుపాడులో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌కు వస్తున్న అపూర్వ ఆదరణను తట్టుకోలేక నైరాశ్యం ఉన్న కూటమి పార్టీలోని మూకలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడం దారుణమన్నారు. దాడిపై ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించి కూటమికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు, ఎంపీటీసీలు పొల్నాటి శ్రీను, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఓటమి తట్టుకోలేక ఈ దుశ్చర్య: తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

కుక్కునూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సీఎంపై దాడికి నిరసనగా ఆదివారం కివ్వాక గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ బస్సు యాత్రలో ముఖ్యమంత్రికి ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి ఓర్వలేక ఓటమి భయంతో ప్రతిపక్ష పార్టీలు ఇటువంటి దుశ్చర్యకు పాల్పడ్డాయని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్, బట్టు వీరబాబు, సూర్ల రాము, పగిళ్ల అల్లేష్ పాల్గొన్నారు.

సీఎంపై దాడి హేయమైన చర్య
– ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు : ఓటమి భయంతోనే ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడికి దిగడం హేయమైన చర్యని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సీఎంపై దాడి ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం జగన్‌కు గాని, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు తగిలిన దెబ్బలను పరిశీలిస్తే రాయితో దూరం నుంచి అలా కొట్టడం సాధ్యంకాదని, ఇది కచ్చితంగా ఎయిర్‌గన్‌తో దాడి అన్నారు. గాయపడిన తీరును బట్టి నిపుణులను పిలిచి నిర్ధారణ చేయాలన్నారు. ప్రజల అభిమానం, దేవుడి ఆశీస్సులు ఉన్నంత కాలం జగన్‌ను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. విజయవాడలో మనమంతా సిద్ధం యాత్రలో సీఎంతో పాటు గాయపడిన మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావును ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం పరామర్శించారు. విజయవాడలోని వెల్లంపల్లి నివాసానికి వెళ్లి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ప్రతాప్ ఆకాంక్షించారు.

చంద్రబాబు, లోకేష్, పవన్‌పై చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు ఫిర్యాదులు

చింతలపూడి: రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌లపై అనర్హత వేటు వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతులను ఆదివారం పత్రికలకు విడుదల చేశారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న సీఎం వైఎస్ జగన్‌పై రాళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం అమానుష చర్య అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని, దాడులు చేయాలని ప్రోత్సహిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడటం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లేనని అన్నారు. తక్షణమే జరిగిన సంఘటనపై చంద్రబాబు, లోకేష్, పవన్ ప్రసంగాలపై సమగ్ర విచారణ జరిపి శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమెరికాకు నూజివీడు మామిడి


వెంకటాయపాలెంలో మామిడి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్‌రావు

నూజివీడు: నూజివీడు నుంచి మామిడి అమెరికా, కెనడా దేశాలకు ఎగుమతి అవుతోంది. మండలంలోని హనుమంతులగూడెంకు చెందిన ఎస్‌వీబీ రాఘవరావు అనే రైతుకు వెంకటాయపాలెంలోని ఎనిమిది ఎకరాల్లో బంగినపల్లి, చిన్నరసాలు, చెరుకు రసాల రకాలను సాగు చేస్తున్నారు. అయితే ఈ రైతు ఎలాంటి రసాయన మందులు, ఎరువులు వినియోగించకుండా కేవలం సేంద్రియ పద్ధతిలో మాత్రమే మామిడి తోటను సాగు చేస్తున్నారు. దీంతో ఈ తోటలోని కాయలు నాణ్యతతో ఉండటంతో ఎగుమతి వ్యాపారి కోసూరి శ్రీనివాస్ రైతు వద్ద టన్ను కాయలను రూ.80 వేలకు కొనుగోలు చేసి ఈనెల 16న 1.2 టన్నుల మామిడి కాయలను కెనడాకు ఎగుమతి చేస్తున్నారు. దీనిలో భాగంగా వ్యాపారి ఆదివారం కాయలను కోయించి కృష్ణా జిల్లా మొవ్వ మండలం అయ్యంకిలో ఉన్న ప్యాక్‌హౌస్‌కు పంపారు. ఈ కాయలను ఒకరోజు ప్రీకూలింగ్, రైపెనింగ్ వంటి ప్రక్రియలు నిర్వహించి బెంగళూరుకు పంపుతారు. అక్కడ నుంచి విమానాల్లో కెనడాకు కాయలను ఎగుమతి చేస్తారు. ఇదే వ్యాపారి గతేడాది 125 టన్నుల మామిడి కాయలను యూకే, కెనడా, సౌదీ అరేబియా, యూఎస్‌ఏ, దుబాయ్‌లకు ఎగుమతి చేశారు. ఈ ఏడాది 300 టన్నుల కాయలను ఎగుమతి చేయాలని నిర్ణయించారు. విదేశాలకు మామిడి ఎగుమతి చేస్తుండటంతో ఏలూరు జిల్లా ఉద్యాన అధికారి ఎస్ రామ్మోహన్‌రావు వెంకటాయపాలెంలోని రైతు తోటను, కాయలను కోసే విధానాన్ని పరిశీలించారు. నూజివీడు ఉద్యాన అధికారి రాజులపూడి హేమ, కోసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డాక్టర్ విక్రమ్‌కు పురస్కారం

తణుకు: తెలుగు వెలుగు సాహితీ వేదిక, విరాట్ విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా ప్రతి ఏటా అందజేసే మహానంది జాతీయ పురస్కారాన్ని తణుకుకు చెందిన డాక్టర్ ఆత్కూరి వెంకట విక్రమ్ అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని సంస్థ వ్యవస్థాపకులు పోలోజు రాజ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

దార్శనికుడు బీఆర్ అంబేడ్కర్

ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని


జెడ్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ పద్మశ్రీ


ఏలూరులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, మేయర్ నూర్జహాన్


యర్నగూడెం లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వనిత తదితరులు

ఏలూరు టౌన్: భారతదేశానికి దిశానిర్దేశం చేస్తూ అత్యంత శక్తివంతమైన రాజ్యాంగాన్ని రూపొందించి, సమసమాజ స్థాపనకు విశేష కృషి చేసిన దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. ఆళ్ల నాని మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పేదల పక్షాన నిలబడుతూ మహనీయుల బాటలో సమాజంలో సమానత్వానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆనాడు బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం
– రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. యర్నగూడెంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి వనిత మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సమాజంలో అసమానతలను రూపుమాపడానికి జీవితాన్నే పణంగా పెట్టిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. దేశానికి రాజ్యాంగాన్నిచ్చిన ఆయనను స్మరించుకోవడం మన బాధ్యతన్నారు. గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ ఉన్నారు.

జెడ్పీ కార్యాలయంలో..

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పూలమాల వేసి, ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీల నవకాంతం, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు 23వ డివిజన్ కార్పొరేటర్ సాంబశివరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముద్దప్పగూడెంలో అగ్నిప్రమాదం

40 ఎకరాల్లో పంటలు దగ్ధం


జామాయిల్ తోటలు దగ్ధమవుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు 40 ఎకరాల్లో పంటలు దగ్ధమైనట్లు సర్పంచ్ కుంజా దుర్గమ్మ తెలిపారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా జీడిమామిడి తోట, జామాయిల్ తోట, తాటి చెట్లతో పాటు తోటలకు మంటలు చెలరేగాయని, ఆ సమయంలో గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారని అన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారని చెప్పారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇరపా బాబూరావు, కుంజా వెంకటేష్, ఇరపా నాగమణిలతోపాటు మరికొందరు రైతుల తోటలు సుమారు 40 ఎకరాల వరకూ దగ్ధమైనట్లు ఆమె తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు సంజీవరెడ్డి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కూల్ డ్రింక్ షాపులో పనిచేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల ప్రకారం.. పట్టణంలోని లాకు సెంటర్ దేశాలమ్మ ఆలయం ఎదురుగా ఆచంట టీడీపీ సీనియర్ నాయకుడు టి విశ్వేశ్వరరావుకు పాండురంగా ఐస్ పార్లర్ ఉంది. ఈ షాపులో వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు పనిచేస్తున్నారు. వీరంతా ఆ షాపు పైన ఉన్న రూములోనే నివాసం ఉంటున్నారు. వారిలో ఒంగోలు జిల్లా అంకెంపాలెంకు చెందిన సంజీవరెడ్డి (25) ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీపీ ఫుటేజీల్లో రాత్రి 12.20 వరకూ సెల్ ఫోన్ చూస్తున్నట్లు ఉండగా అర్ధరాత్రి 1 గంట సమయానికి నిద్రించాడు. ఉదయం మిగిలిన యువకులు సంజీవరెడ్డిని ఎంతలేపినా లేవకపోవడంతో షాపు యజమాని విశ్వేశ్వరరావుకు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన విశ్వేశ్వరరావు నిరంజన్ రెడ్డిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై బాదం శ్రీనివాసు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు.

వ్యవసాయాన్ని పండగ చేసిన జగన్

- రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు
- ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, వైఎస్సార్ యంత్ర సేవ వంటివి అమలు
- ఐదేళ్లలో జిల్లాలో 11 లక్షల మంది రైతులకు రూ.1,076 కోట్ల లబ్ధి
- 409 ఆర్‌బీకేలకు ఒక్కొక్క భవనానికి రూ.21.25 లక్షల మంజూరు


వైఎస్సార్ యంత్ర పథకంలో పవర్ టిల్లర్స్ అందజేస్తున్న దృశ్యం (ఫైల్)


డ్రోన్ సహాయంతో వరిపైరుపై పురుగులమందు పిచికారీ దృశ్యం (ఫైల్)

భీమవరం: వ్యవసాయాన్ని పండుగ చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. జిల్లాలోని 20 మండలాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, రైతు భరోసా, వైఎస్సార్ యంత్ర సేవ వంటి పథకాలతో ఐదేళ్లలో సుమారు 11 లక్షల మంది రైతులకు దాదాపు రూ.1,076 కోట్లు లబ్ధి పొందారు. సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడమేగాక పంట విక్రయం సమయంలో మద్దతు ధర లభించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో రైతులు ఆనందంగా సాగుచేస్తున్నారు. వ్యవసాయం దండగన్న గత ప్రభుత్వ హయాంలో సక్రమంగా వర్షాలు కురవక సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అష్టకష్టాలుపడి పండించిన పంటకు మద్దతు ధరలేకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యంగా రైతులు భావించారు. అటువంటి తరుణంలో 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలకు చెక్ పెట్టారు. సాగు ప్రారంభంలోనే ఏడాదికి రూ.13,500 చొప్పున రైతు భరోసా అందజేశారు. రైతు భరోసా పథకంలో దాదాపు 7 లక్షల మంది రైతులకు రూ.742 కోట్లు, సున్నా వడ్డీ పథకంలో జిల్లాలో 81,209 మంది రైతులకు సుమారు రూ.11.22 కోట్లు అందజేశారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీగా 1,41,234 మంది రైతులకు రూ.104 కోట్లు, పంటల బీమా పథకంలో 1.14 లక్షల మంది రైతులకు రూ.217 కోట్లు లబ్ధి పొందారు. దీనితో రైతులకు పెట్టుబడి సమస్యలు తొలగడమేగాక పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకుని దళారుల ప్రమేయం లేకుండా పంట సొమ్ములను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు.

రైతన్నకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు

రాష్ట్రవ్యాప్తంగా విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయంపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. దాదాపు ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి వాటికి సొంత భవనాలు మంజూరు చేశారు. జిల్లాలో 409 రైతు భరోసా కేంద్రాలకుగాను ఒకొక్క భవనం నిర్మాణానికి రూ.21.25 లక్షలు మంజూరు చేశారు. దీనితో రైతు భరోసా కేంద్రాల్లో అధికారులు నిత్యం అందుబాటులో ఉండడమేగాక ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు లభ్యం కావడంతో రైతుల పంట పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అర్హత కలిగిన రైతులకు వరినాట్లు యంత్రాలు, కోత మెషీన్లు, క్రిషి ట్రాక్టర్లు వంటివాటిని సబ్సిడీపై ప్రభుత్వం అందించింది. దీంతో ఎకరాకు 55 బస్తాలకు పైగా దిగుబడి సాధిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

దళారుల ప్రమేయం లేకుండా..



గడిచిన 5 ఏళ్ల కాలంలో వివిధ పథకాల కింద జిల్లాలోని 11 లక్షల మంది రైతులకు రూ.1,076 కోట్లు లబ్ధి చేకూర్చాం. ధాన్యం విక్రయాల్లో దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్ములను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నాం. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేయడానికి ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

సబ్సిడీపై పవర్ టిల్లర్ తీసుకున్నా



ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో సబ్సిడీపై పవర్ టిల్లర్, రోటోవేటర్‌ను 5గురు సభ్యులతో కలిసి తీసుకున్నాం. పవర్‌టిల్లర్ ఖరీదు రూ.1.85 లక్షలు కాగా దానిలో రూ.70 వేలు ప్రభుత్వం సబ్సిడీ, అలాగే రోటోవేర్ ఖరీదు రూ.1.20 లక్షలు కాగా రూ.33 వేలు సబ్సిడీ వచ్చింది. సొంతంగా సాగుచేస్తున్న పొలంతోపాటు ఇతర రైతులకు దుక్కుతున్నాం.

భూపతిరాజు రంగరాజు, రైతు, విస్సాకోడేరు

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో శ్రీరాట్నాలమ్మ తల్లి

పెదవేగి : కోరిన కోర్కెలు నెరవేర్చేతల్లిగా పేరుగాంచిన పెదవేగి మండలం రాట్నాలకుంటలో వెలసిన శ్రీరాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.51,570, విరాళాలపై రూ.10,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 32,250, ఫొటోల విక్రయంపై రూ.5,550 మొత్తం రూ.99,970 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. సతీష్‌కుమార్ పేర్కొన్నారు.

వాహన కదలికలపై ప్రత్యేక నిఘా


ముసునూరు నేలపాటివారికుంట వద్ద వాహనాల తనిఖీలు

ముసునూరు: సార్వత్రిక ఎన్నికలు చేరువైన నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు తరలింపుపై ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలోని బృందం ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, వలసపల్లి కూడలి కేంద్రాల్లో పలు వాహనాలను పరిశీలించి, తనిఖీలు చేశారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక, గ్రామాలను గుర్తించి నిఘా పెంచినట్లు తెలిపారు.

కట్టుదిట్టంగా ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ


ఈవీఎంల కేటాయింపును పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టరేట్‌లో ఈవీఎం గోదాములో నిర్వహిస్తున్న ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ ఆదివారం పరిశీలించారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గత శుక్రవారం నిర్వహించి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పూర్తి చేయడం జరిగింది. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుంచి స్థానిక ఈవీఎం గోడౌన్ వద్ద బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లను వరుసగా 120, 120, 130 దామాషాగా విభజించారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బీయూలు 4,184, సీయూలు 4,184, వీవీ ప్యాట్లు 4,534 తరలిస్తున్నారు. వీటిని జీపీఎస్ అమర్చిన డీజీటీ క్లోజ్డ్ వాహనాలలో పోలీస్ ఎస్కార్ట్‌తో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుంది. వీటిని వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్ వరకు భద్రపరిచి సీలు వేస్తారు. ఇంతవరకు చింతలపూడి, పోలవరం, నూజివీడు, ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలకు సంబంధించి ఈ ప్రక్రియ పూర్తి అయ్యిందని అధికారులు తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం కమిషనింగ్ (ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ ఫిక్స్) చేయడం జరుగుతుంది. చివరిగా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి పోలింగ్ స్టేషన్ల వారీగా తరలిస్తారు. కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టరు బి.లావణ్య వేణి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్ప మణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఈవీఎం నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు


ఏలూరులో ఆళ్లనాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన యువత


ఎ.గోకవరంలో పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్, వాసుబాబు

ఏలూరు టౌన్: రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వామేనని, ప్రతి కుటుంబానికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి చేస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని అన్నారు. ఏలూరు 12వ డివిజన్‌లో సుమారు 300 మందికిపైగా టీడీపీ, జనసేనకు చెందిన కాపు, ముస్లిం యువత ఆళ్లనాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఆళ్ల నాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. రాష్ట్రానికి మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నాని చెప్పారు.

ఎ.గోకవరంలో 50 యాదవ కుటుంబాలు చేరిక

ఉంగుటూరు: మండలంలోని ఎ.గోకవరం గ్రామంలో 50 యాదవ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన యాదవ సంఘం ఆత్మీయ సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే రైతుల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.


పరసావానిపాలెంలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

అలాగే ఎమ్మెల్యేగా మరోసారి వాసుబాబును గెలిపిస్తే సీఎంగా వైఎస్ జగన్‌ని గెలిపించినట్లేనని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు. తొలుత గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, జిల్లా యాదవ సంఘం నాయకుడు గోపాలకృష్ణ, పార్టీ గ్రామ నాయకుడు మిద్దే వేంకటేశ్వరరావు, యాదవ సంఘం గ్రామ నాయకుడు కానుబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కలిదిండి మండలం పరసావానిపాలెంలో ఆదివారం జరిగిన ముదిరాజ్ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం టీడీపీ నుంచి 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే డీఎన్నార్ వైఎస్సార్ సీపీ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బీసీ నాయకులు కొమటి విష్ణువర్ధన్, పాము రవి కుమార్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ముచ్చు దుర్గారావు, సిరివెళ్ల దుర్గారావు, ముచ్చు స్వామి గంజాల వీరాంజనేయులు, పరసా కోటేశ్వరరావు, ఓలేటి రాంబాబు, తుమ్మా నవీన్, తుమ్మా ప్రసాద్, పెరుమాళ్ళ మల్లయ్య స్వామి, ముచ్చు రాజు తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో గుర్వాయిపాలెం ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ధర్మకర్త చిట్టూరి బుజ్జి, చిట్టూరి వాసు, మారుబోయిన విష్ణు, యాళ్ల జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


తణుకులో అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అజయ్‌కుమార్

తణుకు: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని తణుకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఐ.అజయ్ కుమార్ పేర్కొన్నారు. తణుకు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అజయ్‌కుమార్ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. విద్యావాలీ ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ గృహిణులు వంటగదుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమలో లీడింగ్ ఫైర్‌మెన్లు పీఎస్‌ఆర్‌వీ ప్రసాద్, ఎ.అప్పారావు, ఎంవీ వెంకటేశ్వరరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎస్.వెంకటేశ్వర్లు, హెచ్‌సీ దుర్గారావు సిబ్బంది పాల్గొన్నారు.

దారి విషయంలో ఇరువర్గాల ఘర్షణ.. వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం దారి విషయంలో జరిగిన ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఓ వ్యక్తి మృతికి దారితీసింది. అనంతరం పరస్పరం వారు ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కొమరాడ గ్రామానికి చెందిన గొర్ల సత్యవతి, గొర్ల వెంకటేశ్వరరావు (53)కి పొరుగున గొర్ల చిన సత్యనారాయణ, గొర్ల లక్ష్మి, ఉంటున్నారు. వీరికి దారి విషయంలో గొడవలు జరగడంతో గతంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం గొర్ల చిన సత్యనారాయణ తన ఇంటి ముందు దారి వద్ద గోడ కట్టుకుంటున్నారు. గొర్ల సత్యవతి, వెంకటేశ్వరరావు దారిలో ఎందుకు గోడ కడుతున్నారని అడుగగా అది కాస్తా కొట్లాటకు దారి తీసింది. దీంతో గొర్ల చిన సత్యనారాయణ, గొర్ల లక్ష్మి, కుమారులు గొర్ల సురేష్, గొర్ల వెంకటేశులు కలసి గునపంతో గొర్ల వెంకటేశ్వరరావు తలపై కొట్టారు. వెంటనే అతడిని భీమవరంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వరరావు భార్య గొర్ల సత్యవతి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై. జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటర్ దాఖలు

దారిలో గోడ కట్టుకుంటుంటే గొర్ల సత్యవతి, గొర్ల వెంకటేశ్వరరావు, గొర్ల నాగరాజు తమపై దాడి చేశారని గొర్ల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభలేఖలు పంచడానికి వెళ్లి..

పాలకొల్లు సెంట్రల్: శుభలేఖలు పంచడానికి వెళుతున్న ఓ వ్యక్తి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురంలోని శ్రీహరిపేటకు చెందిన మురపాక సంతోష్‌కుమార్ (37) తన అన్న కుమారుడి వివాహ వేడుకకు బంధువులకు శుభలేఖలు పంపిణీ చేసేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై ఉదయమే బయలుదేరాడు. నరసాపురం నుంచి జగన్నాథపురం వెళుతుండగా మార్గం మధ్యలో పాలకొల్లు పట్టణ సమీపంలోని పెంకుళ్లపాడు టిడ్కో గృహాల సముదాయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై హరికృష్ణ తెలిపారు.

సాంకేతికతను అందుకుంటేనే నూతన ఆవిష్కరణలు

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్


నూజివీడు ట్రిపుల్ ఐటీలో టెక్‌జైట్-24లో విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్

నూజివీడు: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం చంద్రశేఖర్ అన్నారు. ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ అండ్ క్యాంపస్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన టెక్ జైట్-24 ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విప్లవానికి విద్యార్థులు నాంది పలకాలన్నారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీల లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. సాంకేతిక విద్యను ఇన్ని వేల మందికి దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. విద్యార్థులు మూసధోరణిని వదిలివేసి వినూత్న ఆలోచనలు చేస్తేనే నేటి పోటీ ప్రపంచంలో రాణించడం సాధ్యమవుతుందన్నారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనల వైపు దృష్టి సారించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. ఇలాంటి సాంకేతిక సంబరాలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందింపచేసుకోవడానికి, సృజనాత్మకతను ప్రదర్శించడానికి దోహదపడతాయన్నారు. టెక్ జైట్ కన్వీనర్ డాక్టర్ బి జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ టెక్ జైట్-24లో 12 వర్క్‌షాపులు నిర్వహించామని, ఐఐటీ మద్రాస్, ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసు వంటి సంస్థలకు చెందిన నిపుణులతో గెస్ట్ లెక్చర్స్, 33 ఈవెంట్స్ నిర్వహించామన్నారు. వీటిల్లో విజేతలకు బహుమతులను సైతం అందజేశామన్నారు. టెక్‌జైట్-24 కోకన్వీనర్ శ్యామ్ మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా టెక్‌జైట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీన్ రత్నాకర్, ఎఫ్ఓ శ్రీనాథ్, డీఎస్‌డబ్ల్యూ బ్రహ్మాస్వాములు, దుర్గాభవాని, పీఆర్వో సురేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


నూజివీడులో జరగనున్న పోటీలకు ఎంపికైన బాలికల జట్టు


జిల్లా బాలుర జట్టు

ఏలూరు రూరల్: నూజివీడులో జరగనున్న 9వ అంతర జిల్లాల జూనియర్ బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పూర్తి చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల ఆవరణలో బాలికల జట్టు ఎంపిక చేయగా, తాడేపల్లిగూడెం కడకట్ల మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో బాలుర జట్టు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19వ తేదీ నుంచి 22 వరకూ నూజివీడులో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ కార్యదర్శి కె మురళీకృష్ణ, సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారని వివరించారు.